


హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ మున్నూరుకాపులకు ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు



పెద్దపట్నం వేసే ముందు బియ్యం సుంకుపట్టి పూజలు చేస్తున్న ఒగ్గుపూజారులు, ఆలయ ఈవో

# ఎంపీ టికెట్ కాపులకు ఇవ్వాలి

## మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు నేతల విజ్ఞప్తి

జహీరాబాద్, మార్చి 9: జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను మున్నూరుకాపులకు కేటాయించాలని కోరుతూ ఆ సంఘం నేతలు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వారు హరీశ్‌రావును కలిశారు. మీ వినతిని అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. మున్నూరుకాపు నేతలకు గతంలో ఎంతోమందికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అవకాశం కల్పించారని ఈ సందర్భంగా హరీశ్‌రావు వారితో గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో ఏరోజు కరెంట్, సాగు, తాగునీటి సమస్య తలెత్తలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో అన్నీ సమస్యలే నెలకొన్నాయని హరీశ్‌రావు అన్నారు. జహీరాబాద్ ఎంపీగా బీబీ పాటిల్‌ను రెండుసార్లు గెలిపిస్తే ఆయన పార్టీకి మోసం చేశారన్నారు. బీబీ పాటిల్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని నేతలకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మున్నూపుకాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బండెనక బండికట్టి..

## ఏడుపాయల జాతరకు పోటెత్తిన భక్తజనం



- అట్టహాసంగా బండ్ల ఊరేగింపు
- అలరించిన శివసత్తుల పూనకాలు పోతరాజుల విన్యాసాలు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయం వద్ద బండ్ల ఊరేగింపు

పాపన్నపేట, మార్చి 9: మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గమ్మ జాతర కొనసాగుతున్నది. రెండోరోజు శనివారం ఆలయం భక్తజన సంద్రమైంది. జాతరలో కీలక ఘట్టమైన బండ్ల ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. ఆనవాయితీ ప్రకారం పాపన్నపేట సంస్థానాధీశుల బండి ముందు, మిగిలిన బండ్లు దాన్ని అనుసరించాయి. ఆలయం వద్ద శుక్రవారం రాత్రి మహాశివరాత్రి సందర్భంగా కళాబృందాలతో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వీటిని వేలాది మంది భక్తులు తిలకించారు. మహా శివరాత్రి ఉపవాస దీక్షలు పట్టిన భక్తులు ఉదయం మంజీరా నదిలో స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకొని ఉపవాస దీక్షలు విడిచారు. శనివారం అమ్మవారికి పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయం విద్యుత్ కాంతులతో ధగధగలాడింది. ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. బండ్ల ఊరేగింపు సందర్భంగా తొక్కిసలాట జరుగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏడుపాయల ఆలయ చైర్మన్ బాలాగౌడ్, మెదక్ డీఎస్పీ డాక్టర్ రాజేశ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వనదుర్గా భవానీ మాతను దర్శించుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు



అమ్మవారి సన్నిధిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

# పట్నం.. పరవశం

## కొమురవెల్లి ఆలయంలో భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

- పంచ రంగులతో పెద్దపట్నం
- భారీగా హాజరైన భక్తులు
- భక్తులపై స్వల్ప లాఠీచార్జి

చేర్యాల, మార్చి 9: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టాల్లో ఒక్కటైన పెద్దపట్నం కార్యక్రమాన్ని శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తులు మహ శివరాత్రి జాగరణ, పెద్దపట్నం కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. 50 వేల వరకు భక్తులు రావడంతో గంటల తరబడి క్యూలో ఉండి రాత్రి పొద్దుపోయే వరకు స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు గుట్టపైన ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు.

### నయనానందకరం పెద్దపట్నం

పంచ రంగులతో తయారుచేసిన పెద్ద పట్నం వద్ద జానపద రీతిన పాటలు పాడుతూ, స్వామిని స్తుతిస్తూ ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో పెద్దపట్నం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహ శివరాత్రి సందర్భంగా లింగోద్భవ కాలం రాత్రి 12గంటలకు మల్లికార్జున స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు రాజగోపురం, రాతిగీరలు తదితర ప్రాంతాల్లో ఊరేగించి తిరిగి ఆలయంలోకి తీసుకుపోయారు. అనంతరం ఒగ్గు పూజారులు రాత్రి 12గంటలకు మొదటగా గంగా స్నానం, పన్నెండున్నరకు బియ్యాన్ని సుంకుపట్టడం, ఒంటిగంటకు మైలపోలు, అనంతరం రాత్రి 2గంటల ప్రాంతంలో ఒగ్గు పూజారులు భక్తిశ్రద్ధలతో 42 వరుసలతో పెద్దపట్నం తయారుచేశారు. అనంతరం స్వామివారికి బోనం నివేదనగా చెల్లించగానే, ఆలయ అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి వేకువజామున పెద్ద పట్నం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పట్నం దాటారు. ఆ తర్వాత భక్తులు పెద్ద పట్నం దాటి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వేడుకలకు హాజరయ్యారు. ఆలయ ఈవో బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్లు నీల శేఖర్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు ఉత్సవం విజయవంతం చేశారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

### నేడు 8వ ఆదివారం

చేర్యాల, మార్చి 9: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ ఆదివారం కావడంతో రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. మల్లన్న క్షేత్రంలో మొక్కులు చెల్లించుకున్న అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు వెళ్లి అక్కడ బోనాలు సమర్పిస్తారు. భక్తుల కోసం ఆలయ ఈవో బాలాజీ, చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



పసుపు చల్లుకుంటున్న భక్తులు

### భక్తులపై పోలీసుల స్వల్ప లాఠీచార్జి

కొమురవెల్లి మల్లన్న భక్తులపై పోలీసులు, ఎన్‌సీసీ కెడెట్లు స్వల్ప లాఠీచార్జి చేశారు. పట్నం వేయడం పూర్తికాగానే ఆలయ అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పట్నం వద్ద పూజలు నిర్వహించి వెళ్లిపోగానే, ఒక్కసారిగా భక్తులు పట్నం పైకి దూసుకువచ్చారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసులు, ఎన్‌సీసీ కెడెట్లు భక్తులపై లాఠీలు ఝుళిపించారు.



భక్తులపై లాఠీచార్జి చేస్తున్న పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ కెడెట్లు



కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం

# నేడు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు

రామాయంపేట, మార్చి 9: మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని మెదక్ చౌరస్తా బైపాస్ వద్ద రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు సైక్లింగ్ జాతీయస్థాయి అవార్డు గ్రహీత దండు యాదగిరి తెలిపారు.ఈ క్రీడా పోటీలను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్‌రాజు అదనపు కలెక్టర్ రమేశ్, క్రీడల శాఖ జిల్లా అధికారి నాగరాజు ఉదయం 8గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. విజేతలకు ఎమ్మెల్యే, కలెక్టర్ బహుమతులు ప్రదానం చేయనున్నట్లు కోచ్ దండు యాదగిరి ప్రకటనలో తెలిపారు.

# కొమురవెల్లిలో 'మహారాష్ట్ర భవన్'

- భూమిపూజ చేసిన భక్తులు

చేర్యాల, మార్చి 9: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో మహారాష్ట్రకు చెందిన మల్లన్న భక్తులు మహారాష్ట్ర భవన్ నిర్మించుకునేందుకు శనివారం ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌తో కలిసి భూమిపూజ నిర్వహించారు.మహారాష్ట్ర నుంచి వచ్చిన 3వేల మంది భక్తులు మొదటగా మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏటా మహారాష్ట్రలోని నాందేడ్, లాతూర్, పర్భణి తదితర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు కొమురవెల్లికి వచ్చి స్వామిని దర్శించుకుంటారు. రోజురోజుకూ భక్తుల రద్దీ పెరిగిపోతుండడంతో బ్రహ్మోత్సవాల సమయంలో మహారాష్ట్ర భక్తులకు కొమురవెల్లిలో కాటేజీలు లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మహారాష్ట్ర భక్తులు సొంత డబ్బులతో బండగుట్ట ప్రాంతంలో మహారాష్ట్ర భవన్ నిర్మించేందుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మహారాష్ట్ర భక్తుల ప్రతినిధి బాలాజీ మాట్లాడుతూ.. వచ్చే మహ శివరాత్రి నాటికి మహారాష్ట్ర భవన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు.



కొమురవెల్లిలో మహారాష్ట్ర భవన్‌కు భూమిపూజ చేస్తున్న భక్తులు

# పరిశ్రమల కాలుష్యాన్ని తగ్గిస్తాం



సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సీఈటీపీ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, శ్రీధర్‌బాబు



సమావేశానికి హాజరైన పారిశ్రామికవేత్తలు, అధికారులు

- చిత్తశుద్ధితో పనిచేస్తాం..
- పరిశ్రమలకు కేటాయించిన స్థలాలు వాటికే ఉపయోగించాలి
- పారిశ్రామికవేత్తలు విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- పాశమైలారం పారిశ్రామికవాడలో జడ్‌ఎల్‌డీ-సీఈటీపీ ప్లాంట్ ప్రారంభం
- హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ఆహ్వానం లేకపోవడంపై జిల్లా మంత్రి గుర్రు

పటాన్‌చెరు, మార్చి 9: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో రూ. 104.24 కోట్లతో నిర్మించిన జీరో డిస్చార్జ్ కామన్ ఇఫ్ల్యుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (జడ్‌ఎల్‌డీ–సీఈటీపీ)ని శనివారం మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండాసురేఖ, శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు పారిశ్రామికవేత్తల సహకారంతో దీనిని నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. పాశమైలారంలో నిర్మించిన ఈ ప్లాంట్‌తో చిన్న పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేస్తారన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత ప్రజలను కాలుష్యం బారినుంచి రక్షించేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు తెలిపారు. 60 రసాయన పరిశ్రమల వ్యర్థాలు ఇక్కడ శుద్ధి చేస్తారన్నారు. పారిశ్రామికవేత్తలు సీఎస్సార్ ఫండ్ ద్వారా విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఫైర్‌స్టేషన్‌లోని సిబ్బందికి పారిశ్రామికవేత్తలే వేతనాలు ఇచ్చి నియమించుకోవాలని, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల్లో కార్మికులు ప్రమాదాల బారినపడకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పారిశ్రామికవాడల్లో పరిశ్రమల కోసం ఉద్దేశించిన స్థలాల్లో పరిశ్రమలే ఏర్పాటు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఐఐసీ అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... కాంగ్రెస్ సర్కారు పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వరంగల్‌లోనూ ఇలాంటి సీఈటీపీ నిర్మిస్తున్నారన్నారు. ఫైర్‌స్టేషన్‌లో సిబ్బంది నియామకం గురించి సీఎంతో చర్చిస్తానన్నారు. సీఎస్సార్ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఎంప్లాయిమెంట్ కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు సహకరించాలని పారిశ్రామికవేత్తలను కోరారు. పర్యావరణ అనుకూల పరిశ్రమలు ఏర్పాటు కావాలని, పరిశ్రమల ఏర్పాటుతోనే ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు.

### మంత్రుల మధ్య సమన్వయలోపం

పాశమైలారంలోని సీఈటీపీని ప్రారంభించేందుకు తనకు ఆహ్వానం పంపకపోవడంపై జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం ఆలస్యమైంది. మంత్రులు, స్పీకర్‌కు ఈ విషయం తెలియడంతో వారు హైదరాబాద్‌లోనే ఆగిపోయారు. జిల్లా మంత్రి దామోదర నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబుకు తెలియడంతో వారు కార్యక్రమానికి బయలుదేరి మధ్యలోనే రింగ్‌రోడ్డు నుంచే వెనుదిరిగినట్లు తెలిసింది. వారు రావడానికి ఇష్టపడడం లేదని తెలియడంతో నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు అందరితో మాట్లాడి కార్యక్రమానికి వచ్చేలా చేశారు. కార్యక్రమానికి మంత్రి దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ ముందుగా వచ్చి కూర్చున్నారు. ఆ తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వచ్చారు. వారంతా మంత్రి శ్రీధర్‌బాబు కోసం చాలా సమయం వేచి చూసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో సీఈటీపీ సంస్థ నిర్వాహకులు, ఐలా అధ్యక్షుడు మంత్రులకు వేదికపై నుంచే క్షమాపణలు కోరారు. మంత్రి దామోదర రాజనర్సింహ కూడా తన స్పీచ్‌లో పొరపాట్లు మానవ సహజం అని నిర్వాహకులకు సుతిమెత్తగా చురకలు అంటించారు. మధ్యాహ్నం 1.15కి మంత్రి శ్రీధర్‌బాబు రావడంతో మంత్రులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు వేదిక దిగి సీఈటీపీ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, రీ సస్టైనబిలిటీ సంస్థ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పి.మధుసూదన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కాట శ్రీనివాస్‌గౌడ్, ఎల్.సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం


- ఉద్యోగ నియామకాల్లో హుస్నాబాద్ నిరుద్యోగులకు మొండిచేయి
- ఆందోళనలో నిరుద్యోగులు



నోటిఫికేషన్‌ను చూపుతున్న నిరుద్యోగులు

హుస్నాబాద్, మార్చి 9: సింగరేణి సంస్థలో ఉద్యోగ నియామకాలకు విడుదలైన నోటిఫికేషన్‌లో హుస్నాబాద్ ప్రాంత నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని నిరుద్యోగులు ఎం నరేశ్, జే తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హుస్నాబాద్‌లో సింగరేణి సంస్థ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను చూపిస్తూ ఎం.రమేశ్, లక్పతి, హరీశ్, అరవింద్‌తో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థ 269 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లగా హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలు నాన్‌లోకల్ కింద చూపిస్తున్నాయని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాలను లోకల్‌కింద చూపిస్తూ గతంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న ఈ నాలుగు మండలాలను నాన్‌లోకల్ కింద చూపించడం వల్ల ఈ ప్రాంతంలో బీటెక్ తదితర సాంకేతిక విద్య పూర్తి చేసిన నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. నాన్‌లోకల్ కింద 5శాతం ఉద్యోగాల కోసం దేశ వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు దరఖాస్తు చేసుకుంటారని, దీని వల్ల ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే అవకాశం లేదన్నారు. సిద్దిపేట జిల్లాలో కలిసి హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలను సింగరేణి లోకల్ కిందికి మార్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వారు కోరారు.

# మాజీ మంత్రిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



హరీశ్‌రావుతో దుద్దెడ బీఆర్‌ఎస్ నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 9 : కొండపాక మండలంలోని దుద్దెడ బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిలుముల రామ్మోహన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం హైదరాబాద్ నందినగర్‌లోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, నాయకులు కొమ్ము స్వామి, సావిలి దత్తాత్రేయ, చిలుముల అంజిముదిరాజ్ పాల్గొన్నారు.